# తప్పు తప్పుక తప్పే

గంద్రేటి వెంటయ్య

"గుడ్మార్నింగ్ సర్!" ఆగంతకుడు సత్యమూర్తి ఆఫీసుగదిలో అడుగు పెడుతూనే అన్నాడు. చేతిలో చిన్న అటాచీ ఉంది.

"వెరీ గుడ్మార్నింగ్! కూర్చోండి" ఎదుటికుర్చీ చూపించాడు సత్యమూర్తి.

అతను కూర్చున్నాడు. అటాచీని టేబులుపై ఉంచాడు

"చెప్పండి" పెన్ను మూసేస్తూ, తనతోనున్న పనేమిటన్నట్లు చూశాడు.

"ఐయామ్ ఓనరాఫ్ యింటర్నేషనల్ ఎర్త్ మూవర్స్. మా కొటేషన్లు, కంపేరటివ్ స్టేట్‌మెంట్లు మీ టేబులుకొచ్చాయి." అన్నాడతను సిగరెట్టుపాకెట్టునీ లైటర్నీ అందిస్తూ.

"నో ప్లీజ్, థేంక్స్." వారించాడు. "మీ ఫైల్నే ముందేసుక్కూర్చున్నాను. చెక్ చేసి సప్లయి ఆర్డర్ని పుటప్‌చెయ్యాలి. మీరు మధ్యాహ్నమొస్తే ఆర్డరు రెడీగా ఉంటుంది." అన్నాడు మళ్లీ సత్యమూర్తి.

"మెనీ థేంక్స్! ఇదుంచండి." పర్సు తీసి కొంచెం డబ్బివ్వబోయాడు. ఆ గదిలో వేరెవరూ ఉండని కారణంగా అలా టేబులుమీదిగా యివ్వబోయాడు

సత్యమూర్తి అడ్డు వారిస్తూ-

"నో ప్లీజ్! వియార్ పెయిడ్ బై ద గవర్నమెంట్. డోంట్ వర్రీ! మీరు నిశ్చింతంగా వెళ్లిరండి." అంటూ తన పనిలో మళ్లీ మునిగిపోయాడు.

'వెర్రిబాగులవాడిలా ఉన్నాడు' అనుకున్నాడు సప్లయరు.

ప్రపంచమంతా లంచగొండితనంతో కలుషితమయిఉన్న యీ కలియుగంలో యింత నిజాయితీమనిషిని చూడ్డం ఆ వ్యక్తికిదే తొలిసారి అయ్యుండొచ్చు. ఆశ్చర్యంగా చూస్తూ క్షణకాలం అలాగే ఉండిపోయాడు. అప్పటికీ నమ్మకం కుదరక, మరికొంత కలిపి మహోసారివ్వబోయాడు.

"వాట్ హేపెన్డ్ జంటిల్మన్? తక్కు వయిందనేనా?"

"అయామ్ డెడ్ ఎగినెస్ట్ టు కరప్షన్! నా డ్యూటీని నేను సిన్సియరుగానే చేసిపెడతాను. పనికాదేమోనని బెంగపడకండి."

సప్లయరు మెప్పుగా చూసి మరో మారు థేంక్స్‌చెప్పి నిష్క్రమించాడు.

ఇది జరిగి ఇప్పటికి పదిహేనేళ్లు అయింది. సత్యమూర్తి సత్యమేవజయతే వారంతా 'థేంక్స్' తోనే పనిజరిగించుకుపోతూ ఉండేవారు పార్టీని పసపార్లు తిప్పుతూ వాళ్లని హైరానా పెట్టటంకూడా ఎవరు యింతవరకు చూడలేదు.

సత్యమూర్తి ఒక ఇర్రిగేషన్ సెక్షనులో సీనియరు క్లార్కు. హెడ్ క్లార్కు జను, హెడ్ సీటుకూడా. ఆఫీసులో అందరికన్నా అతడు సిన్నియరు. నిజాయితీపరుడు. తండ్రినుండొచ్చిన ఆస్థి కొంత ఉండేది. అందుచేత జీతం విషయంలో కూడ అతడు బేఖాతరుగానే ఉండేవాడు. అతనున్న సీట్లో వద్దంటే డబ్బు. ఐనా ఎవరినుండీ పైసా తీసకో లేదు. సుపీరియర్లంటే అణకువ. ఆఫీసరనేమాటే వేదవాక్కు. అవసరముంటే ఉదయమే ఆఫీసు కొస్తాడు పనిఉంటే రాత్రి పదయినా ఆఫీసు వదలడు. ఆ కారణంగానే సత్యమూర్తి అదే ఆఫీసులో పదిహేనేళ్లుగా ఉన్నాడు.

ఇర్రిగేషనాఫీసులో యించుమించుగా ప్రతిరోజూ ఒక పర్వదినం. కంట్రాక్టర్లు - కంపెనీ మనుషులూ - పేమెంట్లు - పెర్సంటేజీలు - మామూళ్లు - మంచి చెడ్డలు - టిఫిన్లు - టీ కాఫీలు - నో స్మోకింగ్‌బోర్డు - సిగరెట్టుపీకలు - మార్చి నెలంతా, ఆఫీసుకి వచ్చేపోయే గ్రాహకులతో పెద్ద పెళ్లి సందడిలా ఉంటుంది. తెల్లారింది మొదలు అర్ధరాత్రివరకు కోలాహలంగానే ఉంటుంది. పసందయిన విందులో ఆఖరు వంటకం మార్చినెల.

ఒకసారి సత్యమూర్తి కొడుకు హరిశ్చంద్ర చివాట్లువేశాడు.

"ఒక్కొక్క ఆఫీసులో రాబడి సీట్ల కోసం పోట్లాటలు జరుగుతుంటే, చేతి కొచ్చిన అవకాశాన్ని చేజేతులా వదులుకుంటున్నావు నువ్వు. హెడ్డాఫీసులో ప్రతి ఏడాది నీ సీటుకోసం వేలంపాట జరుగుతున్నది. తెలుసా? ఎందుకోసమంటావు? 'థేంక్స్' కూడేసుకోవాలనా? వేలుపోయినా లక్షలు సంపాదించవచ్చునన్న కాంక్ష. నువ్వు కాళ్లవద్ద కొచ్చిన ధనలక్ష్మిని కసిరి మరీ తగిలేస్తున్నావు. ఇది తెలివయిన పనికాదు సుమా! డబ్బవసరం ముదికొన్నాళ్లకిగాని తెలిసిరాదు."

"చూడు చంద్రం! మన కష్టానికి ప్రతిఫలమే ప్రభుత్వవేతనం. ఉద్యోగంలో చేరేప్పుడు మన మొక డిక్లరేషనిస్తున్నాం గుర్తుందా? దాని ప్రకారం లంచాన్ని ఆశించడం ఉద్యోగ ధర్మానికి కత్తిపోటు.

అది దేశద్రోహం. ఆ జీతంతో బ్రతుకు గడవదనుకుంటే, మరో బ్రతుకుతెరువు చూసుకోవాలే తప్ప యిటువంటిపని చేయటం తప్పు."

"చాల్చాల్లేవోయ్, మాటలు మహా చెప్పొచ్చావు, దానిని లంచమనే ఎందుకనుకోవాలి? అది సరదాగా సంతోషంగా యిచ్చే టిఫిను — సినిమాల ఖర్చని ఎందుకనుకోవు? వాళ్ళు కొడుతున్న లాభంనుండి మనకు పెడుతున్న వాటా. అంతే! ఐనా యిచ్చేవాడి కుండని ఏడుపు తీసుకునేవాడికెందు కుండాలి చెప్పు. న్యాయం అమ్మకానికున్న యీ రోజుల్లో, యిది అన్యాయమెలా అవుతుంది?" హరిశ్చంద్రకు సమర్థించాలనే ఉంది. కాని ఎలా చెప్పాలో తెలిసిరావటంలేదు.

"ఏదయినా ఏమయినా కానీయి. అది లంచమే! ముమ్మాటికీ అది అవినీతి పనే. ఒకటి చెప్పుమీ! జీతం తీసుకున్నంత నిర్భీతిగా నువ్వు లంచాన్ని తీసుకోలేవు. ఎందువల్ల? ఆ పని తప్పనేగా? అవినీతనేగా? ఇచ్చేవాడు ఎవరూ చూడకుండా యివ్వాలి. అందుకునేవాడు ఎవరికళ్లా పడకుండా జాగ్రత్తపడాలి. ఎందుచేత? అదెంతవరకు సమంజసమయిన పనో నీ అంతరాత్మ నడుగు! దేశ ఆర్థికస్థితికి కారకు లెవరు? ప్రజల దుస్థితికి బాధ్యులెవరు? లంచగొండి లక్షణం ప్రతి అణువుకిప్రాకుకుపోయింది.లంచగొండులు దేశానికి చీడపురుగులు. ప్రభుత్వ యంత్రాంగమంతా యిటువంటి తతంగంతోనే కలుషితమయి ఉంది. ఆ కుళ్లను బయటకులాగి, యంత్రంలోని భాగాలన్నిటికీ తగిన అయిలు వెయ్యకపోతే రోజురోజుకు మరింత చెత్తఐమయి యంత్రం ఎందుకూ పనికిరాకుండా పోతుంది ..."

హరిశ్చంద్రకు సత్యమూర్తి మాటలిక వినాలనిపించలేదు. ఆ మాటలు తన ఒంటబడితే ఉన్నమతి పోతుందేమోనని భయపడ్డాడు. మధ్యలోనే త్రుంచిపారేశాడు.

"ఇప్పుడు కాదయ్యా నీకు తెలిసొచ్చేది. బాధ్యతలు నెత్తికొచ్చాక అవకాశమున్నప్పుడు ఆర్జించలేకపోయానే అంటూ తర్వాత తల బాదుకు ఏడుస్తావు చూడు!" అన్నాడు హరిశ్చంద్ర.


"అంతవరకు వస్తే ఆలోచిద్దాంలే. ప్రస్తుతాని కిలాగే కొనసాగనీ...." చిరునవ్వుతో మూడును మార్చుకుంటూ అన్నాడు సత్యమూర్తి.

"సరేలే! ఒక ప్రశ్న. ఇప్పుడు నువు తిరస్కరించిన డబ్బు ఎవడి ఇనప్పెట్లో కెళ్లిందంటావ్? నీకు జీతమిచ్చే ప్రభుత్వానికే దక్కిందా?"

"అవినీతిగా గడించేదంతా పాపపు డబ్బే. అదెవడి సంచన జేరితే వాడి కర్మ కాలక తప్పదు."

"ఓహ్హో!" తలపట్టుకున్నంత పనిచేసింది పోయాడు హరిశ్చంద్ర. "కనీసం. వాడెంతలాభం కొడుతున్నాడో కాస్తకామన్ సెన్స్‌తోనన్నా చూడవేం!"

వర్షాల వరదాలని సాముల సాదెన్నా అనుభవించు!




"కష్టపడేది నష్టానికా్కదుగా!"

"బాబూ! నీ తలతిక్క తగ్గించడం నా తరం కాదు." రెండుచేతులు గట్టిగా బాది దండం పెట్టి మరీ వెళ్ళిపోయాడు హరిశ్చంద్ర.

చిన్నగా నవ్వుకున్నాడు సత్యమూర్తి. ఆ నవ్వు అతడనుకున్నట్టు ఎప్పటికీ అలానే ఉండిపోలేదు. అదసంభవం కూడాను.

సత్యమూర్తికి తండ్రిచ్చిన ఆస్థి, నెలంతటికీ చాలని జీతానికి సహకరించి పదిహేనేళ్ళకే హరించుకుపోయింది. ఎదిగిన పిల్లలు, రోగిష్టి భార్య, కరిగిన కలిమి, గొడ్డుచాకిరీ, ఎదగని సంపాదన ఇవీ పదిహేనేళ్ళ సత్ప్రవర్తనలో సత్యమూర్తికి మిగిలినవి. తనకున్న సమస్యలను హతమార్చగల సత్తా తను తెచ్చుకుంటున్న జీతపురాళ్ళకు చాలటంలేదు. ముప్పయిరోజుల కష్టఫలంతో మొదటి మూడువారాలు ముత్తయిదువులకు మల్లే ముందుకుపోతున్నా, నాల్గోవారం మట్టుకు ఒక్కడుగూ ముందుకు వేయడంలేదు. తన అక్కల్లాగానే తననూ పసుపు కుంకుమలతో పచ్చగా పంపమని ప్రాధేయపడ్డంలో నాల్గోవారందేమంత తప్పులేదు. అదే సాధ్యపడ్డంలేదు సత్యమూర్తికి. ఎదుగుతున్న కొడుకులు కూతుళ్లు ఎప్పుడూ డబ్బు డబ్బు అంటున్నారు. భార్యకు రెగ్యులరుగా మందులు కావాలి. ఇంకా ఎన్నో కుటుంబ సమస్యలు. ఇవన్నీ మనసులో పెట్టుకున్న అతడికి మనశ్శాంతి లుండటంలేదు

ఆ రోజు సత్యమూర్తికి అర్జంటుగా మూడువందలు కావలసివచ్చింది. ఆ

అవసరం జీతమొచ్చేవరకు ఆగేది కాదు కొడుకు కాలేజి ఖర్చులకు విధిగా ఉండాలి ఏంచేయాలో ఎవర్నడగాలో తోచలేదు. అన్యమనస్కంగానే, తన టేబిలికి వచ్చిన హ్యూమ్‌పైపు ఫైలుని విప్పిచూశాడు. కోటకోటాల సిమెంటు ఫైటు మూలంగా ఆ మాత్రం పప్పు ఎండికి దొరక్క మానదు.

సత్యమూర్తి మళ్లీ ఆలోచనలో పడిపోయాడు.

మనిషి తన స్తత్వం మార్పును పుంజుకోడానికి కానీ ఒక మహత్తరమయిన కారణం. తన నిజాయితీగా నడుచుకు దామన్న పరిస్థితులు స్థిరత్వాన్ని చెడగొడతాయి. ఎంతటి పాషాణ హృదయుడయినా ఎప్పుడో ఒకప్పటికి మెత్తబడక మానడు. నిజాయితీపై నమ్మకం సడలక తప్పదు.

ఆలోచనలు అతడిలో మార్పును క్రమంగా తెచ్చాయి. అతడు కట్టిన మడి ఏ క్షణాన్నయినా జారిపడవచ్చు. అతడి ఆలోచనలో మొదటిగా హరిశ్చంద్ర మెదిలాడు.

హరిశ్చంద్ర లంచానికి మారుపేరు పార్టీ సంతోషంగా యిచ్చేదాన్ని సంతృప్తిగా ఎప్పుడూ స్వీకరించడు. వాళ్లతో జోక్సు కట్ చేస్తూ యింకా యింత అడిగి తీసుకుంటాడు. ఇంటి కవసరమయిన కొన్ని సామగ్రులు కూడా పార్టీలద్వారానే సమకూర్చుకుంటాడు. ఒకసారిగొట్టు పార్టీ ఐతే జేబులో చెయిపెట్టి మరీ తీసుకుంటాడు. సినీమాకెళ్లాలని ఉంటే, టిక్కెట్లెవరో తెచ్చి యివ్వాల్సిందే. టిఫిను వేళకు ఎవరో పకీరో పట్టాల్సిందే. ఎవరికీ జంకడు కూడాను. అంత చలాకీగా ఉండబట్టే, అవసరాలను చక్కగా గుర్తించుకుంటూ ఎదిరెల చదరపు అంగుళల ప్లాటుకొని, కావలసిన కన్‌స్ట్రక్షన్ మెటీరియల్సుని కంట్రాక్టర్లు, సూపర్వైజర్ల ద్వారా సంగ్రహించి ఒక బ్రహ్మాండమయిన భవంతిని కట్టేసి, నెలకు వెయ్యిరూపాయలు అద్దెరూపేణా అందుకుంటున్నాడు. ఇప్పుడతడు ఉద్యోగం చేసినా చెయ్యకపోయినా చింతలేదు. స్కూటరుంది. రికార్డుప్లేయరు, స్టీరియో లాంటివి కూడా ఉన్నాయి. హాయిగా బ్రతుకుతున్నాడు.

కాని తనకు జరిగినవి తలపుకొచ్చి మనస్తాపం కలిగించి.

అప్పై ఆఫీసుకి కొత్తగా వచ్చిన అబ్దుల్లా గురించి సాగింది ఆలోచనంతా. రెండేళ్లయింది అతడా ఆఫీసుకొచ్చి. హెచ్ సబ్‌డివిజన్‌కి అటెండు. 'అల్లా అల్లా' అంటూ అరుస్తాడు. అల్లా ఆదేశానుసారం నడుచుకోడం తన ధర్మమంటాడు. వినోద కాలక్షేపాల కతడు విరుద్ధం. ఎన్నో నీతులు చెబుతుంటాడు. డ్రాయర్లో డబ్బుని దేవుడికి అదే తన లెక్కకు సరిపోసంతవరకు, డ్రాయరు నుండి పెన్నుపైకి తీయడు. స్కూటరు

కొన్నాడు. చిన్నచిన్న వస్తువులెన్నో కొన్నాడు. నాలుగు రాళ్లు వెనకేసుకున్నాడు. ముగ్గురు పెళ్లాం పిల్లలకు, మూడుపూట్లా తిండిపెడుతూ, ముద్దుగా చూసుకుంటున్నాడు.

ఇక మూడోవ్యక్తిగా కాషియరు కోటేశ్వరరావు కళ్లముందు మెదిలాడు. అతనాఫీసుకొచ్చి మూడేళ్లు మాత్రమే అయ్యింది. భుజాన ఎయిరుబేగుతో ఒంటి దిగాడారోజు. చప్పటి నేలపై పరచుకుంటు పడుకునేవాడు. రెండుజతల బట్టలు, ఒక టవలు, లుంగీ, ఒక దుప్పటి, అరిగిన హవాయి చెప్పులు అతడి అప్పటి సంసారం. బక్కపల్చని గుంటనక్కవంటి పర్సనాలిటీ. కాని యిప్పుడు? ఇంటినిండా సర్దించాడు. హంగులను చూస్తే దంగయిపోతారెవరన్నా. మూడురోజులకొక డ్రెస్సువిప్పుతున్నాడు. మనిషి పోలికలే మారిపోయాయి. పెళ్లికూడా యీ మధ్యనే చేసుకున్నాడు. పర్సులో పైకం వందల్లో ఉంటుంది. పనామా సిగరెట్లు గోపాల్ కిల్లీ గంటగంటకీ అలవాటు. రసుగుల్లా తప్ప మరొక టిఫిను పడదు. రిక్షాలోనే రాకపోకలన్నీను.

కళ్లముందు కదిలిన యీ మూడు కారెక్టర్లు సత్యమూర్తి మనసుని మరింత మెత్తబరచి వదిలాయి. అవకాశాన్ని సద్వినియోగ పర్చుకున్నారంతా. దర్జాగా గడుపుకుంటున్నారు. హాయిగా ఉంటున్నారు. నిర్భయంగా దిల్‌కుష్‌గా రోజులు వెళ్లదీస్తున్నారు. కాని, తనేం చేశాడు? కాళ్లవద్ద కొచ్చిన వందల్ని వదులుకున్నాడు. బాలీవాలని జీతమిస్తూ, సెట్టలా ఫైళ్లను దేకి నీతిగా బ్రతుకు నాయనా అంటే అదే పదివేలనుకున్నాడు.

పెరగని జీతం తప్ప మించిన అవసరాలు ఎదుగూబొదుగూ లేని యీ సంసారాన్నెలా ముందుకీడ్చడం? ఏదన్నా పార్టయిమ్ జాబ్‌కి ప్రయత్నించాలన్నా, ఆఫీసులోనే అర్ధరాత్రయిపోతున్నదే! ఇంటికవసరమయిన డబ్బు ఏదోవిధంగా యింటికొస్తేగాని యింట్లో ప్రశాంతత కుదరదు అనుకున్నాడు.

లోగల్లా ముసిరిన ఆలోచనలను అతి ప్రయత్నమ్మీద పారద్రోలుతూ హ్యూమ్‌పైపు ఫైలుని ముందుకి లాక్కున్నాడు. రేట్లు చూస్తుంటే తొలిసారిగా అతడికి అసహ్యం వేసింది. పదిరోజులక్రితం సప్లయిచేసిన వేరొక కంపెనీ రేట్లకన్నా యీ కంపెనీ రేట్లు రెట్టింపులో ఉన్నాయి. లోకమంతా నోట్లకోనమే పోట్లాట. కొందరిలో నీతినియమాలగురించి ఆలోచించగల వివేకమున్నా, వాళ్ల మనసు అవినీతినే అధికంగా ఆదరిస్తుంది.

క్షణం అలా చూస్తూ ఉండిపోయాడు ఏమీతోచక. అబ్దుల్లా, హరిశ్చంద్ర, కోటేశ్వరరావు అంతా అందుకే నిర్మోహమాటంగా నిర్భయంగా ముక్కుపిండి మరీ గుంజుతున్నారు. దొరగారికి, యీ దోపిడీదార్లకి జరిగిన ఒప్పందాలు ఎంతటి

అవినీతినయినా, సిబ్బంది మట్టుకు యిబ్బంటి పెట్టకూడదు. కళ్లు మూసుకొని ఎర్రసిరాతో టిక్కులు పెట్టుకుంటూ పోవలసిందే. అంచేత పెద్దాళ్లు చేసిన దానికి పయ్యంటు, తమకు వీలయినంత తస్కరించటమే క్రిందివారి లౌక్యం. ఈ సత్యాన్ని తన సహోద్యోగులంతా ఆరంభదశలోనే ఆకళింపు చేసుకున్నారు. తనుమాత్రం ఒక్డి కుంక.

"గుడ్మార్నింగ్!" కంపెనీమనిషి.

"వెరీ గుడ్మార్నింగ్! కూర్చోండి." ఆలోచనలనుండిబయటపడుతూసమాధానమిచ్చాడు సత్యమూర్తి. సప్లయర్ని చూసిన గుండెలో తొలిసారిగా ఆశ కలిగింది. ఇతడేమిచ్చినా తిరస్కరించకూడదన్న నిర్ణయానికొచ్చాడు.

"యస్!.. వాట్ కెనయిడు ఫర్యూ?" కూర్చున్నవాణ్ణడిగాడు.

"అయామ్ ఫ్రమ్ ఎవరెస్ట్ ఎంటర్ప్రయిజస్. మా కొటేషన్లున్నాయి మీ ముందు. చూసి పంపిస్తారని."

"మిగిలిన సప్లయింగ్ ఏజన్సీస్ కన్నా మీ రేట్లు రెట్టింపుగా ఉన్నాయి. ఈ విషయమై నోట్ పుటప్ చెయ్యాలనుకుంటున్నాను" అతడి సర్వీసులో ఎప్పుడూ ఆ కంపెనీ మనిషితోను అలా మాట్లాడలేదు. అందుకే మాటల్లో చిన్న వణుకులాంటిది కలిగింది.

"ఇ.ఇ.గారు చెప్పిన రేట్లే వేశాం. పైగా రోజురోజుకీ మార్కెట్టు పెరుగుతుంటుంది. మా రేట్ల గురించిగాని, క్వాలిటీ గురించిగాని అంతగా ఆలోచించనక్కర్లేదండి." అన్నాడావ్యక్తి 'మధ్య నువ్వెవడివోయ్' అన్నట్టు చూస్తూ

సత్యమూర్తికి అప్పై ఏం మాట్లాడాలో తోచలేదు.

"ఓ.కె. పంపించేస్తాను. కాస్త వేరే అర్జంటు పనుంది. మీ పనికి ఒక అర గంట ఆగాలి." అంతా ప్రయోగించే అస్త్రాన్నే సత్యమూర్తి వదిలాడు. ఆ మాటే వేరొకరి నోటయినా వస్తే 'మామ్మూళ్లు ముందు పడేయి' అన్న అర్థం స్పష్టమయ్యేది. సత్యమూర్తికి అంతపాటి నేర్పింకా అబ్బలేదు. మాటల మర్మం ఎలాఉన్నా, అనుభవజ్ఞుడయిన సప్లయర్కి అది స్పష్టంగానే అర్థం అయింది. ప్రత్యేకంగా తీసిఉంచిన నోట్లను చుట్టలా చేతిలో బంధించి టేబిలు సొరుగులో పడవేశాడు. ఎవరోగమనిస్తున్నట్టు కర్టెను కదిలింది. సత్యమూర్తి గుండె దడదడలాడింది. ఎవరన్నా చూసేశారేమోనన్న భయం కలిగింది. పైన ఫేను తిరుగుతున్నా ముఖంపై చమట బిందువులు పుట్టుకొచ్చాయి. మెదడు మొద్దుబారిపోయింది. ఒంట్లో సన్నగా ఒణుకు మొదలయింది. అంతరాత్మ చావుకేక పెట్టింది.

"ఫైలు వెంటనే పంపించేయండి!" శాసిస్తున్నట్టుగా వినిపించింది కంపెనీ మనిషి మాట.

"అలా గే!" స్వరం బొంగురుపోయింది.

సొరుగులోని డబ్బుని జేబులోకి మార్చుకునేందుకు సాహసం చాల్లేదు సత్యమూర్తికి. ప్రక్కలో వాక ఆటంబాంబు ఉన్నంత భయం కలిగింది. డబ్బుని పర్సులో వేసుకొనేందుకు ప్రయత్నించాడు. కర్టెను కదిలింది. చెయ్యి వెనక్కొచ్చేసింది. బలరాం లోనికొచ్చేశాడు. దొరగారినుండి పిలుపు వచ్చింది. డబ్బును సొరుగులో వదిలి దొరగారి గదికెళ్ళడానికి మనసొప్పలేదు అలా వెళ్లడం క్షేమమూ కాదు. ఎవరన్నా సొరుగు తెరిచి చూస్తే కొంప మునుగుతుంది. ఏం చేయడానికయినా ఎదురుగా బలరాం ఉన్నాడు. ఎప్పుడూ పిల్చేసి వెళ్ళిపోయే బలరాం, ఆ వేళ సత్యమూర్తిని వెంట తీసుకువెళ్తానన్నట్టుగా నిలబడే ఉన్నాడు. అతడు కదిలితే పర్సులో వేసుకుందామని నసిగాడు.

"అర్జంటుగా రమ్మన్నారు" అన్నాడు బలరాం.

సత్యమూర్తికి ఏంచేయాలో తోచలేదు. ఎక్కడివక్కడ వదిలి బలరాంతో వెళ్లక తప్పలేదు. డబ్బును గూర్చిన భయమూ వెంటే వెళ్లింది. మనిషి చాంబరులో ఉన్నా మనసు సొరుగులోనే ఉంది.

"సత్యమూర్తీ, యీయన విజిలెన్స్ ఎస్పీయిగారు. ఏవో కావాలంటున్నారు. చూడు!" ఇ.ఇ. గారన్నారు.

అప్పటి అతడి స్థితిలో విజిలెన్సు మాట వినేసరికి ప్రాణాలు పైకెగిరిపోయాయి. ముఖంలో నెత్తురుచుక్క మిగలకుండా పోయింది. క్షణంలో ఒళ్లంతా చమట కారింది. గొంతుక పిడచగట్టుకుపోయింది. కాళ్ల క్రింది భూమి తలక్రిందులవుతున్నట్టనిపించింది. గుండె దడక్ దడక్ మంటూ కొట్టుకోసాగింది. లంచంగా పెట్టిన డబ్బును తప్పించి పెట్టుకోనయినా లేదు. అప్పుడే విజిలెన్సువాళ్లా? అంటే యిదేదో అనుకొని చేసినపనిలా ఉంది. ఖర్మ! తనకీ వేళ యిలాంటి పాడుబుద్ధి పుట్టిందేమిటి? ఈ గండంనుండెలా బయటపడటం? తనింక ఆఫీసులో తలెత్తుకు తిరగగలడా? తన గౌరవ మర్యాదలన్నీ గంగపాలయినట్టేనా? ఏం చేయను భగవంతుడా? సత్యమూర్తి మనసు పరిపరివిధాల పోయింది.

"ఏం సత్యమూర్తీ, అలా నిలబడిపోయావ్?" ఆశ్చర్యంగా చూశారు ఇ.ఇ.గారు.

"ఏంలేదు సార్! ఏం కావాలోనని ..." నూతిలోనుండొచ్చినట్టున్నాయా మాటలు.

"ఆ మధ్య హిమాచల్ హ్యూమ్ పైప్‌వాళ్ల కిచ్చిన ఆర్డరుపై ఏదో కంప్లేంటుందట. దాని రికార్డులు అవీ కావాలంటున్నారు. తీసి యివ్వు."

'హమ్మయ్య!' అనుకున్నాడు సత్యమూర్తి. మనసుకు కాస్త రిలీఫ్ కలిగింది. గుండెదడా తగ్గింది.

"అలాగే సార్! అవన్నీ వెదికి తియ్యాలి." కాస్త టైము కావాలన్నట్టు అన్నాడు.

"ఆయనిప్పుడే తీసుకొని వెళతారట. వెంటనే వెదికివ్వాలి మరి" అంటూ సత్యమూర్తికి పని పురమాయించి, "మీరు కూడా వెళ్ళి చూసుకోండి ఏయే రికార్డులు కావాలో" అంటూ ఎస్సయిని కూడా సత్యమూర్తి వెనకే పంపించేశాడు. విజిలెన్సు డిపార్టుమెంటు మనిషి ఎదురుగా ఉన్నంతసేపు ఇ.ఇ.గారు ఫోమ్‌సీటులో కూర్చున్నా అది ముళ్ళసజ్జమీద కూర్చున్నట్టే ఉండసాగింది. ఎప్పుడెవడు ఫోన్జేసి ఏమేమి మాట్లాడినా ప్రమాదమే. ఈ కారణంగానే అతణ్ణి లేవగొట్టాడు.

సత్యమూర్తి వెనువెంటనే వచ్చిన ఎస్సయి ఆ గదిలో తిష్టవేసి కూర్చున్నాడు దిష్టిబొమ్మలా. నడీటిలో పడ్డ ఎలకలా ఉంది సత్యమూర్తిపని ప్రక్కలో ఆటంబాంబుంది. ఎదురుగా అగ్గిరవ్వ. దురదృష్టవశాత్తు అగ్గిరవ్వ ఆటంబాంబును చూసిందా యిక తన బ్రతుకు మండి మసయినట్టే. రికార్డులకోసం గాలిస్తున్నాడేగాని అతడి మస్తిష్కం మట్టిముద్దలా ఉంది. కట్టుబట్టలతో ఏ మడుగులోనో మునిగివచ్చాడా అన్నంతలా చమటతో తడిసిపోయాడు. చూపు పిచ్చివాడి చూపులా ఉంది. కళ్ళు తాగినవాడి కళ్ళలా ఉన్నాయి.

అరగంట గాలింపుతో ఎస్సయి కావాలన్న రికార్డులు బయటికొచ్చాయి. వాటిని దొరగారి సమక్షంలో ఎస్సయికిచ్చినాక గాని అతడికి ఊపిరందలేదు.

ఎస్సయి వెళ్ళగానే కంపెనీ మనిషొచ్చి బైఠాయించాడు. ఎస్సయి కూర్చున్న టైములో అతడు రానందుకు సంతోషించాడు సత్యమూర్తి.

అప్పుడనుకున్నాడే, అతడి పనీ పూర్తిచేసి ఫైలు పంపేసరికి నాలుగయిపోయింది టైము. ఈ గొడవల్లోపడి కాఫీకి [illegible] వెళ్ళకపోవడంతో కాళ్ళు తేలిపోయినట్టయింది. ముఖం ముడుచుకుపోయింది. చమటతో ఒళ్ళు జిడ్డువారింది. మనసు కలత చెందింది. తల బరువెక్కిపోయింది. పనిచేసే ఓపిక చచ్చిపోయింది.

కుర్చీలో వెనక్కివాలి కొన్ని క్షణాలు కళ్ళు మూసుకున్నాడు. ఆ కొన్ని క్షణాల్లోనే ఎన్నో ఆలోచనలు మళ్ళీ. వాటికో రూపం రాగానే కుర్చీలోనుంచి లేచాడు. తను పంపిన ఫైలుసంగతి చూద్దామని వెళ్ళాడు. మళ్ళీ సీటుకొచ్చి కూర్చున్నాడు.

సప్లయర్‌కి ఆర్డరు కాగితాన్నందించాడు. సొరుగుతెరిచి నోట్లకట్టను కూడా అతడికే యిచ్చేశాడు.

ప్రశ్నమార్కు మొఖంలోకి చూస్తూ సత్యమూర్తన్నాడు. "ఇది నా సొరుగులో ఉన్న కొన్ని క్షణాల్లోనే నాలో ఎక్కడా లేని అశాంతిని సృష్టించింది. గుండెను పిండిచేసింది. నా నీడకే నే జడిసేలా చేసింది. అటువంటిది ఇంటికి చేర్చితే మరింత కష్టాలపాలవ్వాలసొస్తుంది" అంటూ ఒక నమస్కారం పెట్టేశాడు.

ఇప్పుడు సత్యమూర్తి మనసుకెంతో హాయనిపించింది.

—